ప్రజాశక్తి

ఆదివారం 11 ఆగస్టు 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు





హడావుడే.. కొనేది లేదు..

- రాజధానిలో పెరిగిన భూముల ధరలు
- విక్రయాలకు స్థానికేతరుల మొగ్గు
- జంగిల్ క్లియరెన్సు పనులతో పెరిగిన సందడి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని గ్రామాల్లో మళ్లీ రియల్టర్ల రాకపోకలు పెరిగాయి. కొనుగోలు దారులు వస్తున్నారు... వెళ్తున్నారు... ధరలు తెలుసుకుంటున్నారు. కానీ కొనుగోళ్లు జరగడం లేదు. రిజిస్ట్రేషన్ల వరకు వెళ్లడం లేదు. ప్రభుత్వం మారిన తరువాత రాజధానికి పూర్వవైభవం వస్తుందని భావిస్తున్నా ఇంకా పూర్తి స్థాయిలో నమ్మకం కలగడం లేదని, అంతేగాక ధరలు భారీగా పెంచడం వల్ల ఆశించిన స్థాయిలో లావాదేవీలు జరగడం లేదని రియల్టర్లు చెబుతున్నారు. బ్లాక్ మనీ ఉన్న వారు కొద్ది మంది, ఆదాయం పన్ను నుంచి మినహాయింపు పొందాలనుకునే వారు. రాజధానిలో మాకు ఒక ప్లాటు వుందని భావించి కొనుగోలుకు ఆసక్తి చూపేవారు ఆడపాదడపా వస్తున్నారు. కానీ రైతులు ప్లాట్లు విక్రయాలకు ఆసక్తి చూపిస్తున్నా వారు ఆశిస్తున్న ధరలకు బేరాలు జరగడం లేదు.

ప్రస్తుతం రాజధాని గ్రామాల్లో జంగిల్ క్లియరెన్సు పనులు జరుగుతున్నాయి. వివిధ దశలోఉన్న బహుళ అంతస్తులు నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాజధాని జనసంద్రాత పెంచడానికి వ్యూహరచన చేస్తున్నారు. అయితే ఇవ్వనీ కార్యరూపం దాల్చడానికి ఇంకా కనీసం ఆరు నెలల వరకు వేచిచూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం భూములు ధరలు భారీగా పెరిగాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందని, అమరావతికి పూర్వవైభవం వస్తుందని ముందే ఊహించిన కొంత మంది రియల్టర్లు ఆరు నెలల క్రితమే ఈ ప్రాంతంలో భూములు కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. గతంలో తక్కువ ధరలకు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు రెట్టింపు ధరలకు విక్రయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విక్రయించుకోవాలని అనుకుంటున్న వారిలో వాస్తవ రైతులు తక్కువ మందే ఉంటున్నారు. రైతులు కాని వారు ఇతర ప్రాంతాల నుంచి వెళ్లి కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం ఉన్న సానుకూల వాతావరణాన్ని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. మెట్ట ప్రాంతంలో గతేడాది భూముల ధరలు గజం రూ.20 నుంచి 25 వేలు వరకు ఉండగా ఇప్పుడు రూ.35 నుంచి రూ.40 వేలు వరకు చెబుతున్నారు. అలాగే జరీబు (మాగాణి) గ్రామాల్లో గత ఏడాది గజం రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.50 వేలనుంచి రూ.60వేలకు పైగా

2లో



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న జస్టిస్ ధీర్‌జ్‌సింగ్ ఠాకూర్, తదితరులు

బాలల రక్షణకు సమిష్టి కృషి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి-గుంటూరు

సమాజంలో బాలలపై నేరాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ నిర్మాణాత్మకమైన పాత్ర పోషించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ అన్నారు. శనివారం గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్లో ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు (జువెనైల్ జస్టిస్ కమిటీ) ఆధ్వర్యంలో విభిన్నప్రతిభావంతుల, బాలల హక్కుల పరిరక్షణపై జరిగిన వార్షిక రాష్ట్ర స్థాయి భాగస్వాముల సదస్సును జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయ, విభిన్న ప్రతిభావంతులైన బాలలకు ఉన్న జూవైనల్ జస్టిస్ చట్టంతో ఇతర చట్టాలను సమర్థంగా అమలు చేయాలన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలను ఎటువంటి అసమానతా చూపకుండా సమగ్ర విద్యను అదించాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యా సంస్థలు కూడా ఇలాంటి బాలలకు అనుగుణంగా వారి కట్టడాలను నిర్మించాలన్నారు. ఇలాంటి బాలలకు విద్యా సంస్థలో అడ్మిషన్ ఎటువంటి వివక్షత చూపకూడదచెప్పారు. జువైనల్ జస్టిస్ కమిటీ చైర్ పర్సన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ విషయంలో ప్రతి

2లో

ఇతర పథకాలకు ఉపాధి హామీ నిధుల కోసం కృషి

రాష్ట్ర సర్పంచుల సంఘం అసోసియేషన్ నాయకులతో కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామీణాభివృద్ధిలో కీలకమైన సర్పంచ్‌లను వైసిపి ప్రభుత్వం జీరో చేసిందని గ్రామీణాభివద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం రాష్ట్ర సర్పంచుల సంఘం అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. సర్పంచుల ఇబ్బందులు, గ్రామాల్లోని సమస్యలు, దారిమళ్లిన నిధులు తదితర వివరాలపై చర్చించారు. పక్కదారి పట్టిన ఉపాధి హామీ పథకం నిధుల వివరాలు, గ్రీన్ అంబాసిడర్ల జీతాల భారం, స్థానికంగా చెరువులు కూడా బాగు చేసుకోలేని పలు



సమస్యలను మంత్రి దృష్టికి సర్పంచులు తెచ్చారు. అధికారం చేతిలో ఉన్నా అభివృద్ధి చేసుకో లేకపోయామంటూ పలువురు సర్పంచులు వాపోయారు. ఉపాధి హామీ ద్వారా ఇక నుంచి అయినా నిధులను

2లో

ఉద్ధృతంగానే కృష్ణమ్మ పరవళ్లు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : ఎగువ నుండి వస్తున్న నీటితో నాగార్జునసాగర్ నిండు కుండను తలపిస్తోంది. శనివారం కూడా 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. రెండో శనివారం సెలవుదినం కావడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువగా కనిపించింది. కొత్త బ్రిడ్జి, రైట్ బ్యాంక్‌కి వెళ్లే రహదారి పర్యాటకులతో కిక్కిరిసి పోయాయి. పరవళ్ల తొక్కుతున్న కృష్ణమ్మను పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించటానికి పోటీ పడ్డారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు వీల్లేకుండా జాగ్రత్తలు చేపట్టారు.

విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ప్రకాశంబ్యారేజ్

ప్రజాశక్తి-తాడేపల్లి : స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ప్రకాశం బ్యారేజ్‌ను రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విద్యుత్ కాంతులతో



ప్రకాశం బ్యారేజ్ శోభాయమానంగా కనువిందు చేస్తూ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మరోవైపు ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న వరద నీటితో జలకళతో కృష్ణమ్మ కళకళలాడుతోంది. దీనికి తోడు బ్యారేజ్ పిల్లర్‌లకు అమర్చిన రంగురంగుల విద్యుత్ దీపాల కాంతుల్లో పరవళ్లు తొక్కతూ ప్రవహిస్తున్న కృష్ణమ్మ సొగసులను వీక్షిస్తోన్న సందర్శకులు ముగ్దులవుతోన్నారు. స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుండి దుర్గమ్మ దర్శనార్థం విజయవాడ వచ్చే యాత్రికులు సైతం ఇంద్రధనస్సును చీరగా కట్టుకున్న రీతిగా రంగురంగుల దీపకాంతులతో వెలుగొందుతున్న కృష్ణమ్మను చూసి సంబరపడుతున్నారు.

9 నుండి 4 వరకు విధుల్లో ఉండాల్సిందే

ఆపరేషన్లను వాయిదా వేయొద్దు

జిజిహెచ్ వైద్యులతో సూపరింటెండెంట్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో వైద్యులు ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాధిపతులతో ఆయన శనివారం సమీక్షించారు. ఆపరేషన్ థియేటర్‌కు వచ్చిన ప్రతి కేసునూ

2లో

వార్తలు లోపలి పేజీల్లో





గుంటూరు, నరసరావుపేటలో ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఇతర నాయకులు

సమరశీల కార్యకర్తలే యుటిఎఫ్ బలం

ప్రభుత్వ బడిని కాపాడుకోవడమే ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యం - యుటిఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవాల్లో నాయకులు



విద్యార్థులతో నవ్య, ఉమామహేశ్వర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-తెనాలి

ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులు, అర్హులైన ఉపాధ్యాయులతో మెరుగైన ఉచిత విద్యపై తలిదండ్రుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ళ ఉమా మహేశ్వర్ అన్నారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని పురపాలక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థిని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వేజళ్ల నవ్య నోట్‌బుక్స్, క్రీడా సామగ్రి, డ్రాయింగ్ ఉపకరణాలను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమాహేశ్వర్ మాట్లాడుతూ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకే తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు పోటీగా విద్యాబోధన జరుగుతుందన్న విషయం గమనించాలన్నారు. నవ్య మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో 3, 4 తరగతులు చదువుకున్నానని గుర్తు చేశారు. తన తాత వేజళ్ల వెంకటసుబ్బారావు జ్ఞాపకార్థం తండ్రి ఉమామహేశ్వర్ స్వతహాగా ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారని, విద్యాట్రస్టును ఏర్పాటు చేసి, తమ వంతు బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. యువస్ఫూర్తి పురస్కారంతో ప్రధానోపాధ్యాయిని స్వరూపరాణి, భీమవరపు శివరామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో సిఆర్‌పి శ్రీదేవి, టి.శివప్రసాద్, కె.శివరామృష్ణ పాల్గొన్నారు.

ఒరాఫో జ్యువెల్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



షోరూమ్ ప్రారంభిస్తున్న సినీ నటి కావ్య, ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ఒరాఫో జ్యువెల్స్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట 2వ లైనులో నూతన షోరూమ్‌ను సినీనటి కావ్యకల్యాణ్ రామ్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా వెండి ఆభరణాలపై గ్రాముకు రూ.50 తగ్గిస్తున్నట్టు తెలిపారు. 92.5 విలువైన వెండి విలువైన ఉత్పత్తులను అందించే లక్ష్యంతో గుంటూరులో తన బ్రాండ్ షోరూమ్‌ను ప్రారంభించినట్టు ఒరాఫో జ్యువెల్స్ డైరక్టర్ కల్యాణ్‌రాం తెలిపారు. కస్టమైజ్డ్ డిజైనర్ విలువైన వెండి ఆభరణాల కొనుగోలు అనే కొత్త భావనతో ప్రారంభించామన్నారు.

9 నుండి 4 వరకు విధుల్లో ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం తొమ్మిది గంటలకే మొదటి కేసుగా పరిగణలోకి తీసుకుని ఆపరేషన్లు చేయాలని చెప్పారు. ఈ కేసులన్నీ సీనియర్ వైద్యులు చేపట్టాలన్నారు. ఆపరేషన్లు వాయిదా వేయొద్దని, అత్యవసర ఆపరేషన్ల విషయం వాయిదా పడినట్లు సమాచారం ఇస్తే ఏదో ఒక విభాగంలోని థియేటర్‌ను ఇస్తామని చెప్పారు. డ్యూటీ అసిస్టెంట్ సర్జన్‌లు తప్పనిసరిగా విధుల్లో ఉండాలని, పీజీలపై ఆధారపడొద్దని సూచించారు. అత్యవసర విభాగానికి వచ్చే రోగులను గంటల కొద్దీ ఉంచకుండా ప్రాథమిక చికిత్స చేసి వెంటనే వార్డుల్లోకి పంపించాలన్నారు. 225 వార్డుకు ఆరు ఏసీ మిషన్లు ఇస్తామని, 30 పడకల బర్న్స్, 20 పడకల సెప్టిక్ వార్డుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ థియేటర్‌లో ల్యాప్రోస్కోపీ మిషన్ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కొంతమంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులకు సరిగా రావడం లేదని, వారి స్థానే కొత్త వారిని నియమించాలని వైద్యులు చేసిన సూచనలను డిఎంఇకి పంపుతామని చెప్పారు.

ఉపాధ్యాయ ఉద్యమ వేగుచుక్క యుటిఎఫ్

ప్రజాశక్తి-తాడేపల్లి



యుటిఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న వైవిఎస్ ప్రసాద్

ఉపాధ్యాయ ఉద్యమ వేగుచుక్కగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.ఆంజనేయులు అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా తాడేపల్లి విద్యా వనరుల కేంద్రం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన యుటిఎఫ్ జెండాను సీనియర్ నాయకులు వైవిఎస్ ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పాలక పార్టీలు అనుసరిస్తున్న ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని చెప్పారు. సిపిఎస్ రద్దు చేయాలని, నూతనంగా వచ్చిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి విద్యాబోధన, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిహెచ్.ఆనంద్, రాజారావు, బినహార్, సతీష్, జిల్లా కార్యదర్శులు యు.రాజశేఖర్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, సుబ్బమ్మ, గఫార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం అవసరం

మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



'నారాయణ గురు' పుస్తక ఆవిష్కరణ సభలో డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆలా వెంకటేశ్వరరావు తదితరులు

దేశంలో ఆధ్యాత్మిక ప్రజాస్వామ్యం చాలా అవసరమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం బ్రాడీపేట లోని సిపిఎం కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్యోతిబా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి, జర్నలిస్ట్ బి.విల్సన్ అధ్యక్షతన సామాజిక తత్వవేత్త నారాయణగురు పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు పుస్తక ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య ఐక్యత లేకుంటే మన పొరుగు దేశాల దుస్థితే మనకూ తప్పదని హెచ్చరించారు. దేశంలో ప్రజల మధ్య ఆర్థిక, సామాజిక, సాంస్కృతికతల సమానత్వం రావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రముఖ సాహితీ విమర్శకులు జి.లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ నారాయణగురు సమకాలీనత అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో విసికే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ కుమార్,సామాజిక కార్యకర్త కనకవల్లి వినయ్,బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని ప్రారంభించిన జెడి శీలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సామాజిక అంశాలపై పేద ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు మాజీమంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం శనివారం ప్రారంభించారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ రెండో లైనులలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శీలం మాట్లాడుతూ పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ తన వంతుగా సూచనలు,సలహాలు ఇస్తూ వారితో మమేకం అవుతున్న అతి తక్కువ మంది నాయకుల్లో డొక్కా ఒకరిని ప్రశంసించారు.

హడావుడే.. కొనేది లేదు..

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారు. గత నెలలో కొంత మంది గజం రూ.52 వేల నుంచి రూ.56 వేల మధ్య ఒకటి రెండు రిజిస్ట్రేషన్లు జరగడంతో ఇదే ధరలు ప్రస్తుతం కొనసాగిస్తున్నారు.

రాజధాని గ్రామాల్లో 2015లో అప్పటి టిడిపి ప్రభుత్వం భూసమీకరణ ద్వారా రైతుల నుంచి 34,772 ఎకరాలను తీసుకుంది. భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు సిఆర్‌డిఎ చట్టంలో మూడేళ్లలో రిటర్నబుల్‌ప్లాట్లు ఇస్తామని పేర్కొన్నారు. 2018లో ప్లాట్లు కేటాయించినా అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యేలోగా రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఆ తరువాత 2019 డిసెంబరు 17న అమరావతి రాజధాని స్థానంలో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తున్నట్టు అప్పటి సిఎం జగన్ ప్రకటించారు. దీంతో అమరావతిలో సంక్షోభం ఏర్పడింది. మొత్తం క్రయ విక్రయాలు మందగించాయి. రెండునెలల క్రితం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ అమరావతికి కొత్త కళ సంతరించుకుంటుందని భావించి పలువురు రియల్టర్లు, ధనికులు, వ్యాపారవేత్తలు రాజధానికి వచ్చి భూముల పరిస్థితిని తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

మొత్తం 54 వేల ప్లాట్లు రైతులకు రిటర్నబుల్‌గా అప్పగించారు. వీటిల్లో 2019 వరకు రైతుల నుంచి కొనుగోలు చేసిన స్థానికేతరులు వీటిని విక్రయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజధాని గ్రామాల్లోనే కాకుండా పరిసర మండలాల్లో కూడా గత రెండునెలల కాలంలో భూముల ధరలు భారీగా పెరిగాయి.

ఇతర పథకాలకు ఉపాధి హామీ నిధుల కోసం కృషి

(మొదటి పేజీ తరువాయి)

సమకూర్చాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ వివిధ పథకాలకు ఉపాధి హామీ నిధులను ఉపయోగించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్, ఉపాధి హామీ పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులను, మ్యాచింగ్ ఫండ్స్‌ను అందిపుచ్చుకునేలా కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రెసిడెంట్ వైవిబి రాజేంద్రప్రసాద్, అన్ని జిల్లాల నుంచి సర్పంచులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగరాలి

'ప్రతి ఇంట్లో మువ్వన్నెల జాతీయ జెండా రెపరెపలాడాలని మంత్రి చంద్రశేఖర్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద పోస్టాఫీసులో జాతీయ జెండాల విక్రయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు.

అనంతరం పోస్ట్‌ఆఫీస్ ప్రాంగణంలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ హెడ్ క్వార్టర్స్ ఎపి సర్కిల్ జగదీష్, చీఫ్ పోస్ట్ మాస్టర్ ఏపీ సర్కిల్ డిఎస్‌విఆర్ మూర్తి, గుంటూరు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్ యలమందయ్య పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలింపునకు ఆదేశం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ శివారు బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డ్ నుంచి వెలువడే దుర్గంధం వల్ల స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, సాధ్యమైనంత త్వరగా డంపింగ్ యార్డ్ తొలగింపుకు చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. మంత్రిని గుంటూరులోని ఆయన నివాసంలో తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం కలిశారు. డంపింగ్ యార్డ్ తరలింపు వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. డంపింగ్ యార్డ్‌కు ఆనుకుని ఉన్న రోడ్లపై చెత్త వేయకుండా నోటీస్ బోర్డులు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. తెనాలి పట్టణ సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, గ్రీనరీ, ప్లాంటేషన్ తదితర బ్యూటిఫికేషన్ కార్యక్రమాలను త్వరితగతిన చేపట్టాలని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే తెలియజేయాలని, పనులు మాత్రం ఆలస్యం కాకుండా చూడాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్‌లోపు టెండర్ల దశను పూర్తి చేయించి, అక్టోబర్ మొదటి వారంలో యార్డు పనులు ప్రారంభిస్తామని కమిషనర్ చెప్పారు. ఆయన వెంట డిఇ కె.నాగభూషణం ఉన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన కోసం మారథాన్

ప్రజాశక్తి-గుంటూరు: హెచ్‌ఐవి నివారణ అవగాహనతో సాధ్యమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం వివిధ కాలేజీ విద్యార్థులకు, ప్రజలకు హెచ్‌ఐవిపై అవగాహనకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 5కె రెడ్‌రన్ నిర్వహించారు. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు చిల్లీస్ హోటల్ నుండి ఆర్‌టీఓ ఆఫీసు వరకు ఈరెడ్ రన్ నిర్వహించారు. ఈకార్యక్రమం టిజెపిఎస్ కాలేజీ అధ్యాపకులు పర్యవేక్షణ చేశారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: యువతీ,యువకులు మంచి నడవడికతో సమాజంలో పేరు ప్రఖ్యాతులు గడించాలని ఉన్నతస్థాయి వెళ్లాలన్న లక్ష్యంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.విజయలక్ష్మీ పిలుపునిచ్చారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు అమరావతి రోడ్డు నుంచి ఆర్‌టివో ఆఫీస్ వరకు శనివారం మారథాన్ (రెడ్‌రన్) నిర్వహించారు.

బాలల రక్షణకు సమిష్టి కృషి

(మొదటి పేజీ తరువాయి)డ

ఒక్కరూ నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. జువెనైల్ జస్టిస్ చట్టం 2015 రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల విషయంలోనే కాకుండా, తీవ్రమైన నేరారోపణకు గురయ్యే పిల్లల సంస్కరణ కోసం కూడా ఉద్దేశించబడిందని చెప్పారు. ఈ చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత కూడా ఎంతో ఉందన్నారు. జూవైనల్ జస్టిస్ కమిటీ సభ్యులు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె.కపాసాగర్ మాట్లాడుతూ బాలలను ఎవర్నీ సంక్షేమానికి దూరంగా వదిలియకూడదని, ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులు చాలా ఇబ్బందికి గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. అందుకే చట్టాలను ఏర్పాటు చేసే వారు, వాటిని అమలు పరిచే వారు అందరూ ఒక వేదిక మీదకు రావటం రాష్ట్రం లో ఉన్న విభిన్న ప్రతిభావంతులైన బాలలకు చాలా మంచి శుభపరిణామం అని చెప్పారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో బాలల వైకల్యాలను ముందుగానే గుర్తించేందుకు, ప్రత్యేక అవసరాల పిల్లల హక్కుల రక్షణ కోసం అవసరమైన అన్ని కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేస్తామన్నారు. అనంతరం జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేక అవసరాల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించి, వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ సెక్రటరీ కన్నబాబు, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ఎయిమ్స్ సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.విజయ చంద్రారెడ్డి , యునిసెఫ్ ప్రతినిధి సోనీ జార్జ్ కుట్టీ, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ప్రసన్న కుమార్ వెంకటేష్, గుంటూరు లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ టి.లీలావతి పాల్గొన్నారు.

మంగళగిరిలో ఘరానా మోసం

సరుకుల ఆశ చూపి మోసం

ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్, పర్సుతో పరార్

పోలీసులకు బాధితుని ఫిర్యాదు

ప్రజాశక్తి - మంగళగిరి

అతి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులతో పాటు పెట్రోల్ ఇప్పిస్తానని నమ్మించి తీరా ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, నగదు పర్సుతో సహా ఉడాయించాడు ఓ కేటుగాడు. బాధితుని బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధి యర్రబాలెంకు చెందిన వెలిమిచర్ల దుర్గారావు నగరంలోని ఆటోనగర్ వద్ద గల హలో ఇడ్లీ హోటల్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి ఒకడు దుర్గారావు వద్దకు వచ్చి తన వద్ద నాణ్యమైన బియ్యం, గోధుమపిండి, మరో కొన్ని సరుకులు, మూడు లీటర్ల పెట్రోలూ అతి తక్కువ ధర రూ.1700కే ఇస్తానని నమ్మించి బేరం కుదుర్చుకున్నారు. అనుకున్నదే తడవుగా దుర్గారావు తన కుమారుడు సత్యసాయిని పిలిపించాడు. ద్విచక్రవాహనంలో ఆటోనగర్ హలోఇడ్లీ హోటల్ వద్దకు వచ్చిన సత్యసాయికి, తన తండ్రికి గుర్తుతెలియని వ్యక్తి ఒక కారు డిక్కిలో ఉన్న బియ్యం, గోధుమపిండి శాంపిల్స్‌తో పాటు పెట్రోల్ బాటిళ్లను చూపించాడు. దగ్గరలోని రైస్‌మిల్ దగ్గరకు వస్తే రెండు బస్తాల బియ్యం, గోధుమపిండితో పాటు అక్కడే సరుకులూ ఇస్తానని తండ్రి కొడుకులను నమ్మించాడు. దీంతో నిజమేనని నమ్మిన ఆ ఇద్దరు ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని అగంతకుడిని ఎక్కించుకుని రైస్‌మిల్ వద్దకు బయలుదేరి వెళ్లాడు. అయితే గుర్తు తెలియని అగంతకుడు మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపం వద్దకు చేరుకునే క్రమంలో బండి ఆపాలన్నారు. తన వద్ద సెల్ ఫోన్ లేదని, ఫోన్ ఇస్తే ఒకసారి రైస్‌మిల్ వారితో మాట్లాడతానని అగంతకుడు సత్యసాయిని నమ్మించాడు. కొద్ది సేపు మాట్లాడుతున్నట్లు నమ్మించిన అగంతకుడు ద్విచక్ర వాహనం, డబ్బులు తనకు ఇస్తే ఐదు నిమిషాల్లో బియ్యం, గోధుమపిండి, సరుకులు తీసుకు వచ్చేస్తానని నమ్మబలికి సెల్‌ఫోన్ కూడా తన వద్దనే ఉంచుకున్నాడు. సత్యసాయి తన పర్సును బయటకు తీసి నగదు ఇస్తుండగా ఆ గుర్తు తెలియని వ్యక్తి లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. దీంతో బాధితుడు సత్యసాయి అదేరోజు రాత్రి జరిగిన మోసంపై మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని అగంతకుడు నగరంలోని ఆటోనగర్ వద్ద మరో కొందరి ముఠా సభ్యులతో మాటు వేసి పక్కా స్కెచ్ తోనే ఈ విధమైన మోసానికి పాల్పడినట్లు బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా జరిగిన ఘరానా మోసం పై సీసీ టీవీ ఫుటేజి పరిశీలించి నిందితుని ఫొటోను పోలీసులకు అప్పగించినట్లు బాధితుని బంధువులు తెలిపారు. ఇలాంటి మోసాలు పదేపదే జరుగుతున్నా పోలీసులు పట్టనట్లు ఉన్నారని ప్రజలు వాపోతున్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల

ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. కథనం మేరకు.. పాతరైలు కట్ట ప్రాంతానికి చెందిన షేక్ ఆహమ్మద్ సలీమ్(42) అదే ప్రాంతంలో నూతనంగా ఇల్లు నిర్మించి రంగులు వేయిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అదే గృహంలో పిల్లర్‌కు తాడుకట్టి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఉదయం స్థానికులు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సిఐ ప్రభాకరరావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య మునిషాబేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సిఐ ప్రభాకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మలినేని విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి-గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల పరిచయ వేదికను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిఎస్‌పి గోలి లక్ష్మయ్య మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు చదువు పట్ల ఉండాల్సిన ఉన్నత గౌరవం, చదువుకోవడం వల్ల సమాజంలో పాటించవలసిన ఉన్నత విలువల గురించి వివరించారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ తమ కళాశాలలో విలువలతో కూడిన విద్య అందించడమే కాకుండా పోటీ ప్రపంచంలో మహిళలు ఎదుర్కోవాల్సిన సవాళ్లను వివరించారు. కళాశాలలో విద్యార్థునుల కోసం ఏర్పాటు చేసిన బోధనా పద్ధతులను సజనాత్మక శైలిని, క్యాంపస్ ప్లేస్మెంట్స్‌కి సంబంధించిన విషయాలను వివరించారు.

లింగ వివక్షతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అమరావతి : లింగవివక్షతపై గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆవరణలో అవగాహన సదస్సు తండు లక్ష్మణ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. బత్తుల బాబు మాట్లాడుతూ సంప్రదాయ సంస్కృతి ప్రభావం వలన ఈ లింగ వివక్షత ఏర్పడిందన్నారు. దీన్ని సమతుల్యం చేయడానికి విద్యలో సమానత్వం ఒక ప్రధానమైన అంశంగా ప్రభుత్వాలు సూచించాయన్నారు. అందులో భాగంగానే సర్వ శిక్ష అభియాన్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యా పథకం, గురుకుల పాఠశాలలో ఉద్భవించాయని పేర్కొన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల్ని ఆడ మగ అనే బేధం లేకుండా సమానంగా పెంచాలన్నారు. పిల్లల చదువుల విషయంలో తల్లిదండ్రులు ప్రముఖ పాత్ర వహించాలన్నారు. గుడ్ షెఫర్డ్ సంస్థ డైరెక్టర్ సుపీరియర్ సిస్టర్ విన్నెరసి మాట్లాడుతూ ఈ సమాజంలో జండర్ డిస్క్రిమేషన్ ఎక్కువగా ఉందన్నారు ముఖ్యంగా ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేసి వాళ్ళ హక్కులని కాలరాస్తున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ డియానా సమస్త సిబ్బంది పవన్, మరియమ్మ, మహిళలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖాళీగా పోలీస్ అవుట్‌పోస్టు

ప్రజాశక్తి - మంగళగిరి



శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద సందర్శకుల కోసం టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తూ ఉంటారు. అయితే కొంత కాలంగా విధుల్లో ఎవరూ ఉండకపోవడంతో అవుట్‌పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. దూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో వచ్చే సందర్శకుల భద్రత కోసం ఏర్పాటైన అవుట్‌పోస్టు నిర్వహణలో నిర్లక్ష్యంతోపాటు దేవాలయం వద్ద ట్రాఫిక్ సమస్యపైనా విమర్శలు వస్తున్నాయి. అవుట్ పోస్టులో పోలీస్ సిబ్బంది ఉంటే ట్రాఫిక్‌నూ నియంత్రించొచ్చని, సందర్శకుల వాహనాలకూ భద్రత ఉంటుందని పలువురు అంటున్నారు.

'చలపతి'లో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



వండ్లమూడిలో చలపతి ఫార్మసీ కాలేజీలో ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం, ఐఎస్‌పిఓఆర్ అమరావతి రీజనల్ చాప్టర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న యాంటీ మైక్రోబయల్ స్టీవర్డ్ షిప్, క్లినికల్ అప్రైజర్-2024 సదస్సు శనివారం ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సివిల్ సర్జన్ డాక్టర్ బి.పి.సతీష్‌కుమార్ విచ్చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి.ఆంజనేయులు అధ్యక్షత వహించారు. డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడారు. యాంటీయాటిక్స్ నిరోధకత ప్రపంచంలో ప్రమాదకరంగా అధిక స్థాయికి పెరిగిందని, కొత్త నిరోధక యంత్రాంగాలు పుట్టుకొచ్చి ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందటమే దీనికి కారణం అన్నారు. డాక్టర్ గౌతమ్‌కుమార్, డాక్టర్ ఈ.నాగదుర్గ వివిధ అంశాలపై ప్రసంగించారు. రెండ్రోజులలో 80కిపైగా ఈ-పోస్టర్లు ప్రదర్శించినట్లు ప్రొఫెసర్ తెలిపారు. అనంతరం వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

'గిరిజనోద్ధరణకు కూటమి ప్రభుత్వం కృషి'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వంలో రద్దైన గిరిజనుల పథకాలను ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి వారికి మేలు చేసేందుకు సిద్ధమవుతోందని మాజీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లోని మెడికల్‌హాల్లో శనివారం నిర్వహించిన ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు, వైద్య, ఉపాధి రంగాల్లో న్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ప్రపంచ ఆదివాసీల దినోత్సవం ఘనంగా నిర్వహించారని కొనియాడారు. సంఘం ఆధ్వర్యంలో పెట్టినటువంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానన్నారు. పల్నాడు జిల్లాల్లో ఎక్కువ మంది గిరిజన ప్రజలు ఉండే ప్రాతం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు రిజర్వేషన్ కాబోతోందని ప్రత్తిపాటి జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్యా పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ చెరుకుపల్లి నిర్మల, టిడిపి ప్రతిపక్ష నాయకులు గంగా శ్రీనివాస రావు, టిడిపి సీనియర్ నాయకులు కందుల రమణ, పలువురు సంఘాల నాయకులు, విద్యార్థులు, యువత, ఎస్టీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పట్టుబడ్డ కేబుల్ వైర్ దొంగలు

ప్రజాశక్తి-ఈపూరు

కేబుల్ వైర్ చోరీ చేసే దొంగల ముఠాను మండలంలోని భద్రు పాలెం గ్రామస్తులు శనివారం పట్టుకున్నారు. గ్రామస్తుల కథనం మేరకు గ్రామ సమీపంలోని పివిసి పైపుల ఫ్యాక్టరీలో కేబుల్ వైర్లను చోరీ చేసి ఒక ప్రదేశంలో నిల్వ ఉంచారు. చుట్టుపక్కల వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ వైర్లను చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు గమనించి వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు పరారవ్వగా గ్రామస్తులు ఇద్దరు మహిళలు ఒక బాలుడిని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మాచర్ల కు చెందిన ఓ కుటుంబం గత కొంతకాలంగా కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతున్నట్లు సమాచారం. మండలంలోని అగ్నిగుండాల, ఊడిజెర్ల, వనికుంట, ఈపూరు గోపువారిపాలెం, కూచినపల్లి, అంగలూరు గ్రామాలలో వ్యవసాయ బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి.

రైలు ప్రయాణికురాలి మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళల నుండి గుర్తుతెలియని దుండగులు గొలుసులు లాకెళ్ళిన ఘటన మండలంలోని తుమ్మల చెరువు గ్రామం వద్ద చోటు చేసుకుంది. రైల్వేపోలీస్ అధికారులు కథనం మేరకు... మండలంలోని తుమ్మల చెరువు గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలును చైన్ లాగి నిలిపివేశారు. ఇదే అదునుగా రెండు బోగిల్లో నిద్రిస్తున్న ముగ్గురు మహిళల వద్ద బంగారు గొలుసులను దోచుకున్నారు. రైల్వే అధికారులు వచ్చేలోపు పరారయ్యారు. చోరీకి గురైన బంగారం సుమారుగా ఐదు నుండి ఆరుతులాలు ఉంటుందని బాదితులు తెలిపారు. బాదితులు చెన్నై నుండి సికింద్రాబాద్ వెళ్తున్నారని దుండుగులు కూడ ఇదే రైలులో ప్రయాణించి సమయం చూసి రైలును చైను లాగి నిలిపివేసి దొంగతనానికి పాల్పడివుంటారని అనుమానం వ్యక్తం చేశారు. బాధిత మహిళలు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనునట్లు తెలియజేశారు..

హత్య కేసులో భర్త, అత్త అరెస్టు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త, భార్యపై కత్తితో దాడి చేసి సంఘటనలో భార్య ఆస్పత్రిలో శనివారం మృతి చెందారు. ఈ ఘటనపై పట్టణ సీఐ పీ.భాస్కర్ వివరాల మేరకు.. స్థానిక మూడవ వార్డుల్లో నివాసం ఉంటున్న పిట్ట నాగేంద్ర కుమార్‌చ హిమబిందులకు 2020లో ప్రేమ వివాహమయ్యింది. వారికి పాప, మూడు నెలల బాబు ఉన్నారు. మృతురాలు వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భర్త నాగేంద్రకుమార్ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించాడు. కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన మూడు లక్షల రూపాయల అప్పు తీర్చటానికి మృతురాలు పేరున ఉన్న ఇంటి పట్టాలు అడిగాడు. అందుకు తిరస్కరించిన ఆమెపై కోసం పెంచుకున్నాడు. తరచూ వేరేవారితో ఫోన్‌సంభాషణ చేస్తోందని తన తల్లి చెప్పడంతో కోపంతో రగిపోయిన నాగేంద్రకుమార్ తన భార్యను కత్తితో పొడిచి చంపేశారు. సదరు ఘటనపై తెనాలి డిఎస్పి జనార్ధనరావు పర్యవేక్షణలో పొన్నూరు పట్టణ సిఐ పి.భాస్కర్ ముద్దాయి పిట్ట నాగేంద్ర కుమార్‌ను దొప్పలపూడి అడ్డ రోడ్డులో అరెస్ట్ చేశారు.





చెరువు కట్ట కింద ఖాళీ స్థలంలో పనులు నిలుపుదల

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-నకరికల్లు

'చెరువు భూమి ఆక్రమణకు యత్నం' శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తి దినపత్రిక లో వచ్చిన కథనానికి స్పందించిన తహశీల్దార్ కె.పుల్లారావు వెంటనే రెవిన్యూ ఇన్స్పెక్టర్ యువ రాజ్, వీఆర్వో సానా గౌరీ, సర్వేయర్ రామిరెడ్డిని, తాగునీటి చెరువు కట్ట కింద ఖాళీ స్థలాన్ని బాగు చేస్తున్న వారి వద్దకు పంపి పనులను నిలుపుదల చేసి పొక్లెయిన్ ను బయటికి పంపించి వేశారు. ఖాళీ స్థలంలో ఇది ప్రభుత్వ భూమి ఎవరైనా ఆక్రమించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బోర్డు ఏర్పాటు చేయించారు.



సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ కోచింగ్ క్యాంపును ప్రిన్సిపాల్ సిస్టర్ సుజాత శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కోచింగ్ క్యాంపు వారం రోజులు పాటు జరుగుతుందని, క్యాంపునకు రాష్ట్రస్థాయి కోచ్ పుచ్చకాయల బాలకృష్ణ పర్యవేక్షణలో జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పిఈటి కుమార్, మణికంఠ, ప్రతాప్ పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని చీమలమర్రి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ తరపున రాయితీపై వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి మాటాడుతూ జేజేఎల్ 384 వరి విత్తనానికి ప్రత్యామ్నాయంగా కెఎన్ఎం 16 38,రకం,107 కింటాళ్లు ఎం టి యు 12 24రకం 26 క్వింటాళ్లు సబ్సిడీపై వరి విత్తనాలను చీమల మర్రి, కుంకలగుంట, చల్లగుండ్ల, రూపైనగుంట్ల, దేచవరం లలోని రైతు సేవ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. వరి విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాల జిరాక్స్ తీసుకొని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. కెఎన్ఎం 16 38 రకం బహిరంగ మార్కెట్లో 40 రూపాయల 50 పైసలు కాగా ఐదు రూపాయల సబ్సిడీపై, సేమ్ టు యు 1224 41 రూపాయల 80 పైసలు కాగా 36 రూపాయల 80 పైసలకు అందజేస్తామన్నారు.

సామాజిక స్పృహతోనూ పనిచేస్తున్న యుటిఎఫ్

● ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు ● విద్యా రంగ,ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాడతామని నాయకుల ఉద్ఘాటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహతో పని చేస్తూ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యా రంగం బలోపేతానికి యుటిఎఫ్ 50 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిందని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్ కుమార్ అన్నారు. యుటిఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో శనివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యుటిఎఫ్ స్వర్ణోత్సవాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు పి.ప్రేమ్ కుమార్, జి.విజయ సారధిలు యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని యుటిఎఫ్ శాఖల ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాల సందర్భంగా పతకావిష్కరణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులకు నిరంతరం సేవలందిస్తూ విద్యార్థులకు బోధనలో మేటిగా నిలుస్తూ సామాజిక స్పృహతో యుటిఎఫ్ నిలిచిందని తెలిపారు. హక్కులు- బాధ్యతలు మనకు సమానమని సంఘ ఆశయాల కనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయడంతో పాటు సంఘం బలోపేతం చేసి, భావి పౌరులలో పోరాట స్ఫూర్తి నింపాలన్నారు. విజయ సారధి మాట్లాడుతూ 1974 లో యుటిఎఫ్ ఆవిర్భవం నుండి ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, సమస్యల పరిష్కారం, ఉపాధ్యాయుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసిందని, పోలీస్ నిర్బంధాలను నాయకులు ఎదుర్కొన్నారని, హక్కుల కోసమే కాకుండా బాధ్యతలనూ ముఖ్యమైన కార్యాచరణగా నిర్వహించారని ఇదే ఒరవడిని ఎప్పటికీ కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల విధానాల వల్ల ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. యుటిఎఫ్ సామాజిక స్పృహలో భాగంగా పీడిత ప్రజల కోసం అంబలి కేంద్రాలు, అన్నదాన కార్యక్రమాలు, వైద్య సేవలు, కరోనా కష్టకాలంలో రూ. లక్షల విరాళాలను అందించడంలో ముందుంన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం మోహనరావు, ఎ.భాగేశ్వరిదేవి, జిల్లా కార్యదర్శి కె.ఉషా శౌరి రాణి, షేక్ జమాల్, రాష్ట్ర కార్యదర్శిలు ఎం.సుందంరావు, షేక్ ఖాసీం పీరా, వివిధ మండలాల నాయకులు కె.వెంకటేశ్వరరావు,ఓ.కోటేశ్వరరావు, వై శ్రీనివాసరావు, పి యోనా, షేక్ మస్తాన్ షరీఫ్, పి సత్యానందరావు, ఎస్.కె మల్లికా బేగం, మేరీ, జి సుధాకర్ రెడ్డి, ఎస్ శివయ్య, కె.వి నాగయ్య, కె. లక్ష్మీనారాయణ, ఎస్ సి హెచ్ కోటేశ్వరరావు, బి లక్ష్మీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

ఉపాధ్యాయ, ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించిన ఘనత యుటిఎఫ్‌దని ఎపిసిపిఎస్ఇఎ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శాంతాభాయి అన్నారు. స్థానిక యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో స్వర్ణత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాంతాబాయి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల ప్రయోజనాల కోసం, న్యాయపరంగా దక్కాల్సిన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక యూనియన్ యుటిఎఫ్ అన్నారు. జిల్లా నాయకులు నాసర్‌రెడ్డి, ఆయేషాసుల్తానాలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు యుటిఎఫ్ పటిష్టతకు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు కె శ్రీనివాసరాజు, కేశవరెడ్డి, షేక్ సకీనా, గాలీబ్, ఈశ్వరయ్య, సత్యనారాయణ, ఎస్‌విఎస్ నాగరాజు, బాలాజీ, నాయక్, ఖాదర్ తదితరులు పాల్గోన్నారు.



నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ యుటిఎఫ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాచర్ల మండల అధ్యక్షులు కే. శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శులు నాసర్ రెడ్డి, ఆయేషా సుల్తాన్, గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం ఎస్ కే షకీనా, సీనియర్ నాయకులు గాలిబ్, ఈశ్వరయ్య, సత్య నారాయణ శాంతాబాయి, నాగరాజు, బాలాజీ నాయక్, ఖాదర్ పాల్గొన్నారు.



విజయపురిసౌత్, మాచర్లలోని యుటిఎఫ్ కార్యాలయాల్లో..



రక్తదానానికి ముందుకు రండి

పల్నాడు విజ్ఞాన కేంద్రం-సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం - 30 మంది రక్తదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రక్తదానం పట్ల అపోహల వీడి 18 ఏళ్లు దాటి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం మూడు సార్లు అయినా రక్తదానం చేయాలని, రక్త దానం ప్రాణ దానంతో సమానమని పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం, సిఐటియు పల్నాడు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని లింగంగుంట్ల శంకర భారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పల్నాడు బాలోత్సవాల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాజగోపాల్‌రెడ్డి (ఆక్స్ఫర్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి),కట్టా కోటేశ్వరరావులు ప్రారంభించారు.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రక్త సేకరణ కేం ద్రాలలో నిల్వలు అంతంత మాత్రంగా ఉన్నాయన్నారు. రక్తం కృత్రిమంగా తయారు చేసే పద్ధతులు లేవని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాటాలు వర్గ పోరాటాలే కాకుండా సామాజిక సేవా దక్పథంతో సిఐటియు రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూసేవా కార్యక్రమాలకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, రానున్న రోజుల్లో పల్నాడు విజ్ఞాన కేంద్రం సిఐటియు చేపట్టబోయే సేవా కార్యక్రమాల నిర్వహణను తాను పాలు పంచుకుంటానన్నారు. దేశ ప్రజలలో కేవలం ఒకటి రెండు శాతం ప్రజలు మాత్రమే రక్తదానం చేస్తున్నారని ఈ సంఖ్య ఇంకా పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రక్తదానం చేసిన 30 మందికి పైగా దాతలను పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు సిఐ టియు నాయకులు బాలోత్సవాల అధ్యక్ష కార్యదర్శులు అభి నందించారు. రక్త సేకరణకు వచ్చిన విజయ బ్లడ్ బ్యాంక్ అధినేతలు మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు వచ్చిన దాతలకు విజయ బ్యాంక్, సేవ్ యో స్వచ్ఛంద సంస్థల సంయుక్తంగా ఉచిత ప్రమాద బీమా వైద్య సేవలో రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్య దర్శి షేక్ మస్తాన్ వలి, సభ్యులుకోయ రామారావు, ఏపూరి గోపాలరావు, షేక్ సిలార్ మసూద్, కామినేని రామారావు, డి.శివ కుమారి గుంటూరు మల్లేశ్వరి, సుభాని తదితరులు పాల్గొన్నారు.




రక్తదానం చేస్తున్న అనుముల లక్ష్మీశ్వర రెడ్డి



రక్త దానం చేసిన ఉపాధ్యాయులతో గుంటూరు విజయ్‌కుమార్, డి. శివకుమారి తదితరులు

సమరశీల కార్యకర్తలే యుటిఎఫ్ బలంం

జెండా ఆవిష్కరణలో నాయకులు



- 51వ ఆవిర్భావ దినోత్సవాల్లో రాష్ట్ర మాజీ అధ్యక్షులు జోజయ్య
- ప్రభుత్వ బడిని కాపాడుకోవడమే ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యం : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



మంగళగిరి, తుళ్లూరులో జెండాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

క్రమ శిక్షణ, సమరశీలత కలిగిన నాయకత్వం, కార్యకర్తల వల్లనే రాష్ట్రంలో యుటిఎఫ్ సంఘం ఉపాధ్యాయ ఉద్యమంలో ప్రథమ స్థానంలో నిలిచిందని సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండవీటి జోజయ్య అన్నారు. శనివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవాలను బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తొలుత యుటిఎఫ్ పతాకాన్ని జోజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలు అప్పారి వెంకటస్వామి, చెన్నుపాటి లక్ష్మయ్య, దాచూరి రామిరెడ్డి నేతృత్వంలో యుటిఎఫ్ ఏర్పాటైందని, నాటి నుండి నేటి వరకు విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్నదన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా, ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదన్నారు. గడిచిన 50 ఏళ్లలో విద్యారంగానికి, ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులు, సౌకర్యాలు సాధించిపెట్టిన ఘనత యుటిఎఫ్‌కు దక్కుతుందన్నారు. అప్రెంటిస్ విధానం రద్దు, రీ గ్రూపింగ్ స్కేల్స్ సాధన, ఉపాధ్యాయ బదిలీలలో పారదర్శకమైన కౌన్సిలింగ్ విధానం, నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన వంటి వాటిని సాధించడంలో యుటిఎఫ్ పాత్ర గణనీయమైనదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించటానికి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడమే ఏకైక లక్ష్యంగా యుటిఎఫ్ చేపట్టిన పోరాటాలు చారిత్రాత్మకమైనవని ఆయన పేర్కొన్నారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే లక్ష్యాలతో పని చేస్తున్న యుటిఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యలకే పరిమితం కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో సైతం పాలుపంచుకుందన్నారు. ఎన్నో పోరాటాల ద్వారా యూటీఎఫ్ సాధించుకున్న హక్కులు, సౌకర్యాలు పాలకుల విధానాల వల్ల కనుమరుగవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల ద్వారానే తిరిగి హక్కులు సాధించు కోవాలని అన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలతో పాటు ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత యుటిఎఫ్ కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సంఘం ఏర్పడిన రోజున ప్రభుత్వ విద్యారంగం మాత్రమే ఉందని నేడు ప్రభుత్వ విద్యా రంగం సగానికిపైగా తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. బడిని కాపాడుకోవడమే ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యంగా తీసుకోవాలని అన్నారు. విద్య ప్రైవేట్ పరమైతే సమాజంలో అసమానతలు, స్వార్థం పెరిగిపోతాయన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్.కుసుమ కుమారి, యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ యం.హనుమంతరావు ప్రసంగించారు.

అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన స్తూపం వద్ద సంఘం కోసం జీవితాలను త్యాగం చేసిన అమర జీవులకు నివాళులర్పించారు. అనంతరం స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ ఆఫీసు నుండి శంకర్ విలాస్ సెంటర్ వరకూ స్వర్ణోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, సీనియర్ నాయకులు కెఎస్‌వి దుర్గారావు, జి.ప్రభుదాస్, ఎస్.తాండవకృష్ణ, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎఎల్.శివ పార్వతి, జిల్లా కోశాధికారి ఎమ్‌డి.గయా సుదౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆది నారాయణ, ఎం.గోవిందయ్య జి.వి.ధన లక్ష్మి, కె.కేదార్‌నాథ్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, కె.ప్రభూజీ, జి.జితేంద్ర, షకీలా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక నిమ్మగడ్డ రామ్మోహనరావు విగ్రహం వద్ద యుటిఎఫ్ జెండాను మండల గౌరవాధ్యక్షులు జి.అచ్యుతరావు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శులు యు.రాజశేఖర్, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జాకబ్, గఫార్, చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక లైబ్రరీ సెంటర్ వద్ద యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు కొండవీటి రాజయ్య ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి యు.రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎ.రఘునాథ్, మండల అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, సహాధ్యక్షులు హిందుమతి, కోశాధికారి వి.ప్రసాద్, కార్యదర్శి ఎ.కళ్యాణ్, సిహెచ్ శివబాబు, బి.శివాజీ, జయలక్ష్మి, ఎన్‌బి.మున్ని పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు సిపిఎం ఘన నివాళులు



పెదనందిపాడులో బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద పాశం రామారావు తదితరుల నివాళి

ప్రజాశక్తి - పెదనందిపాడు

కమ్యూనిస్టు యోధుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన సంతాప సభలో బుద్ధదేవ్ చిత్రపటానికి రామారావు, ఇతర నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రామారావు మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య 11 ఏళ్లపాటు పశ్చిమ బెంగాల్ సిఎంగా ప్రజలకు ఎంతో సేవ చేశారని అన్నారు. సిపిఎంలో 50 ఏళ్లపాటు పని చేసి పొలిట్‌బ్యూరో సభ్యునిగానూ పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఆయన అధికారంలో ఉండగా భూమిలేని పేదలకు భూమిని పంపిణీ చేసి సామాజిక అసమానతలను నిర్మూలించారని అన్నారు. బెంగాల్‌లో పారిశ్రామికీకరణను ప్రోత్సహించి, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించారన్నారు. తన పరిపాలనలో విద్య, వైద్యాన్ని ప్రభుత్వ రంగంలో ఉంచి ప్రైవేటు రంగానికి అడ్డుకట్ట వేశారన్నారు. ఆయన తన మృతదేహాన్ని మరణానంతరం పరిశోధనల నిమిత్తం మెడికల్ కాలేజీకి ఇచ్చి తన గొప్పతనాన్ని చాటారన్నారు. బుద్ధదేవ్ ఆశయాల బాటలో నడవడమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు కె.వెంకట శివరావు, సిమెచ్.యానాదులు, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసరావు, కె.వెంకట సుబ్బారావు, పి.భువనేశ్వరి, షమి, ఎం.లక్ష్మి, విజయలక్ష్మి, రాజేంద్ర, జ్యోతికుమారి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం బుద్ధదేవ్ భట్టాచార్య సంతాస సభ మండల కేంద్రమైన ఫిరంగిపురంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన బుద్ధదేవ్ భట్టాచార్య కష్టజీవుల కోసం ఎనలేని సేవలు అందించారని అన్నారు. సిపిఎంలో క్రింది స్థాయి నుండి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎదిగారని, బెంగాల్ సిఎంగా కార్మికులు, రైతుల కోసం అనేక సంస్కరణలు తెచ్చారని చెప్పారు. అంతస్థాయికి ఎదిగినా చాలా నిరాడంబరంగా జీవితాన్ని గడిపారని, మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసువాలన్నారు. పశ్చిమబెంగాల్లో వామపక్షాలు అధికారంలో ఉన్నంతకాలం మతోన్మాదులు రాజకీయంగా ఎదగలేకపోయారని వామపక్షాలు బలహీన పడిన తర్వాతే మతోన్మాదులకు చోటు దొరికిందని అన్నారు. తొలుత బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటానికి శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అబ్రహం, సతీష్, బాలయ్య, సుజాత, హానోక్, శామ్యూల్, మరియదాస్ పాల్గొన్నారు.



ఫిరంగిపురంలో నివాళులర్పిస్తున్న బి.శ్రీనివాసరావు, ఇతర నాయకులు, కార్మికులు



వైసిపి నుండి మారను : ఎమ్మెల్సీ హనుమంతరావు

ప్రజాశక్తి - మంగళగిరి : తాను వైసిపి నుంచి ఇతర పార్టీలోకి వెళ్లే ఆలోచన లేదని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు చెప్పారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ మంగళగిరిలోని మార్కెట్ సెంటర్‌లో గల గాంధీ విగ్రహం వద్ద శనివారం వైసిపి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన మంగళగిరి పట్టణంలో జరిగిన కళ్యాణ మండపం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన మాటలను కొంతమంది తప్పుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. తాను వైసిపికి చెందిన ఎమ్మెల్సీనేనని, పార్టీ మారే యోచనలో లేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్.రఘు, బి.నర్సయ్య పాల్గొన్నారు.

ఎఎన్‌యు బోర్డు ఆఫ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా డాక్టర్ వెంకట శివలక్ష్మి



ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ చైర్మన్‌గా ఆర్‌విఆర్ విద్యా కళాశాల లెక్చరర్ డాక్టర్ గంటా వెంకట శివలక్ష్మిని నియమిస్తూ ఎఎన్‌యు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శివలక్ష్మి ఈ హోదాలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు. తన నియామకానికి సహకరించిన ఎఎన్‌యు అధికారులకు శివలక్ష్మి కతజ్ఞతలు తెలిపారు. ఆమె నియామకంపై బీఈడీ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.



యువగళం పాదయాత్రలో లోకేష్ తో కలిసి చిన్నా పాల్గొన్న చిత్ర పటాన్ని అందజేస్తున్న టిడిపి కార్యకర్తలు

ఘనంగా పులి చిన్నా పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తుళ్లూరు : అమరావతి దళిత జెఎసి, టిడిపి నాయకులు పులి చిన్నా పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అమరావతి రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని తన స్వగహంలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో వేడుకలు జరిగాయి. ఎన్నికలకు ముందు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో చిన్నా పాల్గొన్న చిత్ర పటాన్ని, గౌతమబుద్ధుని ప్రతిమని చిన్నాకు పలువురు అభిమానులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి మారథాన్‌కు పిఎఎస్ కాలేజి విద్యార్థి



ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

గుంటూరు టిజెపిఎస్ కళాశాల, కుటుంబ సంక్షేమ శాఖ సంయుక్తంగా గుంటూరులో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి మారథాన్‌లో స్థానిక పి.ఎ.ఎస్ కళాశాల బి.కామ్ విద్యార్థి పి.కార్తీక్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ డిపార్ట్మెంట్ అధికారి శ్రీనివాస్ నుండి బహుమతి అందుకున్నాడు. కార్తీక్ త్వరలో విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొటారని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీరరాఘవయ్య తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు ఎక్కడ..?

అది లేకుండా నష్ట పరిహారం సాధ్యమేనా..?

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కేంద్ర ప్రభుత్వం మార్గదర్శ కాల ప్రకారం ప్రతి పంటనూ ఈ క్రాప్ బుకింగ్‌ను భూ ముల వాస్తవసాగుదారునితో మాత్రమే చేయాలి. అది కూడా పంట వేసిన పొలంలోకెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది ఉంటేనే భవిష్యత్‌లో పంట నష్టం సంభవిస్తే రైతులకు పరి హారం అందించడానికి, ప్రభుత్వ పరమైన లబ్ధిపొందటానికి వీలవుతుంది. అయితే ఈ సంవత్సరం నియోజకవర్గ స్థాయిలో ఖరీఫ్‌లో పత్తిపంట ప్రారంభమై కొన్ని పల్లెల్లో 35 రోజుకు మరికొన్ని పల్లెల్లో సుమారుగా 25-35 రోజులైనా ఇప్పటికీ ఈ క్రాప్ బుకింగ్ ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికే సగం పంట కాలం పూర్తయింది. అయినా ప్రభుత్వం ఈ క్రాప్ నమోదుకు చర్యలు తీసుకుంటుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి.

వ్యవసాయ అధికారులకూ పట్టని ఈ క్రాప్ నమోదు

మండల స్థాయిలో 12 వేల ఎకరాల్లో ఖరీఫ్, రబీ కాలాల్లో పంటలు సాగవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు రెండు, రెండున్నర వేల ఎకరాలలో మాత్రమే కేవలం పత్తిపంట సాగు పూర్తి అయింది. జూన్, జూలై నెలలో పడిన వర్షాలకు ఈ పంటలు సాగయ్యాయి. అయినా ఇప్పటికీ ఈ క్రాప్ బుకింగుకు ఎవరూ రాలేదని మండల స్థాయిలో రైతులు వాపోతున్నారు. అది ఉంటేనే దేనికి అయిన పరిహారం వస్తుండన్నట్టు చెప్పటంతో ఈ విషయంపై రైతులకు గుబులు నెలకొంది. ఈ గ్రూపులో సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేసుకోవడం ద్వా రా వారికి ప్రభుత్వం అందించే అన్ని వ్యవసాయ పథకాలకు అర్హులవుతారు. ముఖ్యంగా పంటల బీమా, వడ్డీ లేని పంట రుణాలు, కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల అమ్మకాలు వంటి వాటికి కౌలుదార్లు దూరమవుతారు. పంటసాగు చేస్తున్న వారిని క్షేత్రస్థాయిలో నిజనిర్ధారణ చేసుకొని వారిని వాస్తవ సాగుదారులుగా పరిగణించి నమోదు చేయాలని వ్యవసాయ ఉన్నతాధికారులు సైతం సూచిస్తున్నారు.

వెంటనే ఈ-క్రాప్‌ను ప్రారంభించాలి

రైతులకు, కౌలు రైతులకు వెంటనే పంటపై ఈ-క్రాప్ ప్రారంభించాలని కోరుతున్నారు. ఆ పథకం వల్ల ఎన్నో ఉపయోగాలున్నప్పటికీ రైతులకు చేరడం లేదని వాపోతున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా వీలైనంత త్వరలోనే ఈ-క్రాప్ పద్దతిలో రైతులకు పంటల నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని వ్యవసాయాధికారిని టి.శ్రీలత తెలిపారు. తప్పని సరిగా ప్రతి పంటను నమోదు చేస్తామని తెలియజేశారు.



'చట్టసభలే సమస్యల పరిష్కార వేదికలు'

ప్రజాశక్తి - చిలకలూరిపేట



మాట్లాడుతున్న మాదాసు భానుప్రసాద్

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యున్నత వేదికలు చట్టసభలే అని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్ అన్నారు. ఎన్నిక కాబడిన ప్రజా ప్రతినిధులు విధిగా శాసనసభ సమావేశాలకు హాజరై ప్రభుత్వ విధానాలపై హేతుబద్ధంగా చర్చించాల్సిన బాధ్యత ఉందని దానిని ఎన్నికైనవారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్నార్టీ సెంటర్లోని కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పులివెందుల శాసనసభ్యులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా లేనంత మాత్రాన అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం సబబు కాదన్నారు. కేవలం పత్రికా సమావేశాలకు పరిమితం కావటం సరైన నిర్ణయం కాదన్నారు. 11 అసెంబ్లీ స్థానాలతో 40శాతం ఓటింగ్ సాధించిన పార్టీగా ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా అసెంబ్లీ వేదికగా చర్చించాలన్నారు. ప్రజలు కట్టే పన్ను డబ్బులు ఏ ఏ అంశాలకు ఖర్చు చేయాలి అనే విషయాన్ని చట్టసభల్లో నిర్ణయిస్తారనే విషయాన్ని గుర్తించాలన్నారు. లోక్ సత్తా పార్టీ నుండి 2009 శాసనసభకు ఎన్నికైన ఒకే ఒక అభ్యర్థిగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నాటి ప్రభుత్వ విధానాలపై అసెంబ్లీ వేదికగా తన వాదనను వినిపించిన విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు.

వజ్రగిరి జస్టిస్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్



జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌కు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా శనివారం సత్తెనపల్లి కళా మిత్రమండలి, ఉషోదయ కళాపరిషత్, రోటరీ క్లబ్ సంయుక్తంగా స్థానిక శాంతి నికేతన్ కళాశాలలో ఆత్మీయ సభను నిర్వహించారు. ఈ కార్యమానికి రోటరీక్లబ్ అధ్యక్షులు మాతంగి సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ అవార్డు గ్రహీత పట్టాభి, కళాపీఠం అధ్యక్షులు తూములూరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ. జస్టిస్ కేవలం చిత్రకారుడే కాదు మంచి గాయకుడు, తబలా వాయిద్యకారుడని, రచయిత బహుముఖ ప్రజ్ఞాశాలిఅని కొనియాడారు. జాతీయ చిత్రకారుడు అయిన వజ్రగిరి జస్టిస్ అంతర్జాతీయ స్థాయిలో చిత్ర లేఖనంలో మొదటి బహుమతి పొంది , భారతీయ చిత్ర కళా రత్న అవార్డును , కర్ణాటక కుంచె గురు అవార్డును, లాగోస్ ఇంటర్నేషనల్ హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ పొందటం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి అవార్డులు జస్టిస్ భవిషత్‌లో మరెన్నో పొందాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది, ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షులు పిన్నమనేని పాములయ్యను ఘనంగా గురుసత్కారం చేశారు. అనంతరం వజ్రగిరి జస్టిస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు మద్ద వెంకటస్వామి, అప్కా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లాంవర్ధనరావు, ఎఐటియుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, గుజ్జం జాషవా సాహితి సేవా సంస్థ అధ్యక్షులు పి.యిర్మీయా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళికి వైద్య సిబ్బంది సత్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం విరెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా రెండేళ్ల నుండి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మురళీధర్ ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ బదిలీ అయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని గ్రామాల పరిధిలో వైద్య సేవలు సమర్ధవంతంగా నిర్వహించడంలో డాక్టర్ మురళీధర్ కృషి చేశారని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేవతి బాయ్ అన్నారు. చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించడంలో మురళీధర్ సఫలీకతం అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఓ సురేష్ కుమార్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.



సత్యసాయి విద్యా విహార్‌లో విద్యార్థులకు ఆర్థిక అవగాహన

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల పట్టణంలోని శ్రీ సత్య సాయి విద్యావిహార్ నందు సత్యసాయి విద్యావాహిని సహకారంతో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు శనివారం ఆర్థిక అవగాహన కల్పించారు. అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ భర్షాశర్మ, రోషిని నాయర్, ఆనంద్ వర్గేష్, సాయిప్రియ అమర్, కవిప్రియ భాగ్యలక్ష్మి, కళ్లెం శివప్రసాద్ రెడ్డి, నిషిత మురళి సత్యసాయి విద్యావాహిని తరపునుంచి దుర్గాప్రసాద్, సంధ్యశ్రీ పాల్గొన్నారు. డబ్బు ఎలా ఆదా చేయాలి, డబ్బును ఎలా దాచుకోవాలి, సైబర్ మోసగాళ్ళ బారిన పడకుండా ఎలా ఉండాలి, బ్యాంకు లావాదేవీలు, ఫిక్స్డ్ డిపాజిట్లు, రింకరింగ్ డిపాజిట్లు, ఎడ్యుకేషన్ లోన్లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. ఎసిసిఎ హెడ్ఆఫ్ మెంబర్ భర్షాశర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆర్థిక లావాదేవీల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల తరపునుంచి ఎసిసిఎ నెంబర్లకు మెమొంటోలను అందజేశారు. సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ అక్కినేని అనిల్, సత్య సాయి సేవ సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపల్ వై.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ మధురవాణి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, గురవయ్య, హనుమంతరావు, లక్ష్మణ్ నాయక్, మాణిక్యం, ప్రసన్న రాణి, ప్రియాంక, లక్ష్మీ, నాగమణి, సాయిలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

'పల్నాడును ఎండబెట్టిన జగన్'

ప్రజాశక్తి-వినుకొండ : కరువు నివారణ ప్రాజెక్టుకు తండ్రి పేరు పెట్టుకుని మరీ పల్నాడును ఎండబెట్టిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు టిడిపి ప్రభుత్వం హయాంలోనే ప్రారంభించిన ప్రాజెక్టుకు కనీసం రూపాయి కూడా ఇవ్వకుండా, కిలోమీటర్ పని కూడా ముందుకు తీసుకుని వెళ్లకుండా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని మండిపడ్డారాయన. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని కీలకమైన సాగునీటి ప్రాజెక్టులన్నింటికీ పాతపేర్లు పునరుద్ధరిస్తూ, పల్నాడు కరవు నివారణ ప్రాజెక్టుకు వైఎస్ పేరును తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగితిస్తున్నామని పేర్కొన్నారు. అత్యంత వెనకబాటుకు చిరునామాగా ఉన్న పల్నాడు ప్రాంతంలో నాలుగు జిల్లాల రైతులకు నీళ్లిచ్చే ఈ పథకానికి ఐదేళ్లు మోకాలడ్డారని, తండ్రి పేరు పెట్టుకునీ పైసా పని చేయని వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారు. పల్నాడు కరవు కష్టాలు తీర్చడానికి నదుల అనుసంధానం ఒక్కటే మార్గమని, అందులో పెన్నా-గోదావరి లింకింగ్ కీలకమని మొదట గుర్తించింది, ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది ముఖ్యమంత్రి చంద్రబాబే అని అన్నారు. ఆ దిశగానే గత ప్రభుత్వం లోనే అన్ని ఏర్పాట్లు చేసి, కాంట్రాక్టర్లను నియమించి పనులు ప్రారంభించినా వాటిని మూలకు చేర్చిన వ్యక్తి జగన్ అన్నారు. తర్వాత పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా జగన్ రెడ్డి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ పల్నాడు కరవు నివారణ ప్రాజెక్టుపై దష్టి సారించడం సంతోషం కలగిస్తోందని, త్వరలోనే కరవు నివారణ ప్రాజెక్టు పూర్తి, పచ్చనిపల్నాడు స్వప్నం సాకారం అవుతోందనే నమ్మకం కలుగుతోందని అన్నారు.



విద్యలో మార్పులు అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు : ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్య బోధించే ఉపాధ్యాయులు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆధునిక విద్య పాఠ్యాంశాలకు అనుగుణంగా తమని తాము మలుచుకుంటూ బోధించాలని తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి పసితనంలోనే బాటలు వేసిన వారవుతారని నేషనల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ రాయ కె.రమ పేర్కొన్నారు. శనివారం నగరంపాలెం ప్రజ్ఞ విద్యా సంస్థల్లో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ ఉపాధ్యాయులకు జాతీయ విద్యా విధానం, జాతీయ కరిక్యులం ఫ్రేమ్ వర్క్‌తో పాటు చైల్డ్ ప్రొటెక్షన్ చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రాయ రమ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పాత మూస బోధనలకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జాతీయ విద్యా విధానానికి రూపకల్పన చేస్తున్నారన్నారు. కాలానుగుణంగా పిల్లల్లో వారి ఐక్యూ లెవెల్స్‌కు తగ్గట్టుగా వారి సమగ్ర వికాసానికి బోధనాంశాలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ అధ్యాపకురాలు డాక్టర్ నాగమల్లేశ్వరి, అధ్యాపకురాలు రమ మావూరి ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ షేక్ దస్తగిరి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మాచర్ల రూరల్



వైసిపికి చెందిన స్థానిక మున్సిపల్ 26 వార్డు కౌన్సిలర్ షేక్ దస్తగిరి శనివారం మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఇప్పటికే పది మంది వైసిపి కౌన్సిలర్లు పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన విషయం విధితమే. గత మున్సిపల్ ఎన్నికలలో మొత్తం 31 వార్డులను వైసిపి ఏకగ్రీవంగా గెలుచుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ కౌన్సిలర్లు టిడిపి బాట పట్టారు. మరో పదిమంది కౌన్సిలర్లు త్వరలోనే టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. దీంతో తెలుగుదేశం మాచర్ల మున్సిపల్ చైర్మన్ సీటును కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మదార్ సాహెబ్ తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పల్నాడుకు హాల్టు కల్పించాలి

ప్రజాశక్తి -పెదకూరపాడు

పెదకూరపాడులో పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలని అరసం రాష్ట్ర కార్యదర్శి కె శరచ్చంద్ర జ్యోతిశ్రీ, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు కోరుతూ సంతకాల సేకరణ నిర్వహించారు. శనివారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలంలోని లగడపాడు, లింగంగుంట్ల, తాళ్లూరు, ఖమ్మంపాడులో ఉత్సవంలాగా సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తోందన్నారు. ఈ రైళ్లు హాల్ట్ లేకపోవడం వల్ల వారందరికీ ప్రయాణం భారంగా మారింది. సికింద్రాబాద్- రేపల్లె ప్యాసింజర్ రైలుకీ కూడా హాల్ట్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు, కేసు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండల పరిధిలోని వంగిపురం గ్రామం లోని షాప్ నెంబర్28 లో శనివారం సిఎస్ డిటి పద్మజ షాపు పై తనికీలు నిర్వహించారు.151 బస్తాలకు గాను 104 బస్తాలు మాత్రమే ఉన్నాయి 47 బస్తాలు తగ్గడం తో షాప్ పై 6ఎ కేసు నమోదు చేసినట్లు సి ఎస్ డి పద్మజ తెలిపారు.పలు రికార్డులు కూడా తనిఖీలు చేసినట్లు కూడా తెలిపారు.తనిఖీలు వీఆర్వో రాంబాబు, పాల్గొన్నారు.



రేషన్‌షాప్‌ను తనిఖీ చేస్తున్న సిఎస్ డిటి పద్మజ

ప్రభుత్వ విద్య పరిరక్షణతోనే సామాజిక న్యాయ పరిరక్షణ

లగడపాటి కృష్ణస్వరూప్ మీటింగ్ హాలు ప్రారంభోత్సవంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమకుమారి

ప్రజాశక్తి-చేబ్రోలు

మండల కేంద్రమైన చేబ్రోలులోని యుటిఎఫ్ కార్యాలయంలో లగడపాటి కృష్ణస్వరూప్ మీటింగ్ హాలను యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమకుమారి శనివారం ప్రారంభించారు. తొలుత యుటిఎఫ్ పతాకాన్ని మండల గౌరవాధ్యక్షులు ఐ.శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో కుసుమకుమారి మాట్లాడుతూ మండల స్థాయిలో యుటిఎఫ్ కార్యాలయం, మీటింగ్ హాలు నిర్మాణం చిన్న విషయం కాదని, ఇందుకు కృషి చేసిన, సహకరించిన అందరికీ రాష్ట్ర కమిటీ తరుపున అభినందనలు చెబుతున్నామని అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమ నేతల త్యాగాల ఫలితమే నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అనేక సౌకర్యాలని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం ద్వారానే సామాజిక న్యాయం పరిరక్షించబడుతుందని, దీనిలో భాగంగా పాఠశాలు బలహీనపడడానికి కారణమైన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటును జీవో 117 ద్వారా కాకుండా జీఓ 53 ద్వారానే చేపట్టాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచరణల కమిటీ పూర్వపు చైర్మన్ ఎన్.తాండవ కృష్ణ మాట్లాడుతూ ఈ కార్యాలయాన్ని ఉద్యమ కేంద్రంగా తీర్చిదిద్దాలని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం యుటిఎఫ్ నిరంతరం ఉద్యమిస్తుందని ఉద్ఘా టించారు. రైతుసంఘం నాయకులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కార్మిక, కర్షకులు ఐక్యంగా పోరాడడం ద్వారానే బలహీన వర్గాల హక్కులను కాపాడుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో లగడపాటి కృష్ణ స్వరూప్ భార్య కస్తూరి, కుమారుడు వేణుగోపాల్, సోదరుడు కోటయ్య, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి గయాసుద్దొల, మండలఅధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, వై.రమేష్‌బాబు, కోశాధికారి కె.శ్రీనివాసరావు, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, విజయరాజు, పార్థసారథి, ఎన్.విజయలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు వై.అన్నపూర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాలకు ఎప్పుడూ సహకారం..

సమావేశం మందిరానికి కృష్ణస్వరూప్ పేరు పెట్టడం సంతోషంగా ఉందని దాత లగడపాటి వేణుగోపాల్, కుటుంబీకులు చెప్పారు. హక్కుల కోసం సాగే పోరాటాలు సమాజానికి ఎంతో అవసరమని, వాటికి తమ సహకారం ఎప్పుడు ఉంటుందని చెప్పారు. తమ పూర్వీకులు కోటయ్య, కృష్ణ స్వరూప్ చూపిన బాటలోనే నడుస్తామని వేణుగోపాల్ చెప్పారు. తమ సొంతూరైన నారా కోడూరు తొలి సర్పంచ్‌గా (బోర్డు ప్రెసిడెంట్) 1942లో తాత కోటయ్య వ్యవహరించారని, తండ్రి కృష్ణస్వరూప్ 11వ ఏట నుండే కమ్యూనిస్టుగా, విద్యార్థి ఉద్యమాల్లోనూ చురుగ్గా పని చేశారని తెలిపారు. కబడ్డీలో రాష్ట్రస్థాయిలోనూ పలుమార్లు అవార్డులు పొందారన్నారు. తన అమ్మమ్మ ఊరైన జంపనిలో మొవ్వ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, మాదాల సుబ్బారావు, కోగంటి పాపారావు, పేరా కృష్ణమూర్తితో కమ్యూనిస్టు భావాలతో పనిచేశారని, మాజీ సిఎం కొణిజేటి రోశయ్య, మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావుతో కలిసి కాలేజీ విద్య చదివారని చెప్పారు. నారాకోడులో వెలగా నాగేంద్రయ్య, వెలగా కోటేశ్వరరావు, గూడూరు వెంకట్రావుతో కమ్యూనిస్టుగా పని చేశారని గుర్తుచేసుకున్నారు.



మాట్లాడుతున్న కుసుమకుమారి


విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-తెనాలి

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అతి త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పడుతుందని మాజీమంత్రి అలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక నాజరుపేట విద్యా శంకర భారతి నసింహ సదనంలో వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షులు ఎ.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సమాజంలో ఎంతో గౌరవంగా జీవనం సాగించే బ్రాహ్మణ సామాజిక వర్గానికి ప్రభుత్వం ద్వారా తగిన గౌరవాన్ని ఇవ్వాల్సి ఉందన్నారు. అందుకు అనుగుణంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, బ్రాహ్మణ కార్పొ రేషన్‌ను త్వరలో ప్రారంభించి ఆ సామాజిక వర్గాన్ని ఆదుకోనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏలూరి బ్యాంకు మేనేజర్ ఎన్విఆర్ శేషు కుమార్, సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారా యణ మూర్తి, కె రవి మోహన్, బి కామేశ్వరరావు, పి సూర్య ప్రకాష్ రావు, ఆర్ రాజేంద్రప్రసాద్, టి దక్షిణామూర్తి, కెవి సుబ్ర హ్మణ్యం, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఒకటో తరగతి నుండి డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న 250 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

తెలుగు భాషా పురస్కారానికి డాక్టర్ ప్రజ్ఞాచారి ఎంపిక

ప్రజాశక్తి-తెనాలి




తెలుగు భాష పురస్కారానికి సాహితీ రత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి ఎన్ని కయ్యారు. ఈ నెల 18న డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీ శ్రీ కళా వేదిక నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు పంపిన ఆహ్వానం శుక్రవారం అందు కున్నట్లు ప్రజ్ఞాచారి వెల్లడించారు. ఈ పురస్కారం చాలా విలు వైందని, దీనిని అందుకోనుండటం తనకు ఆనందంగా ఉందని అన్నారు.

పింఛను దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సమాజంలో అర్హులైన ప్రజలంతా న్యాయసేవలు ఉచితంగా పొందవచ్చుని తెనాలి మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాది ఎ.కిషోర్ అన్నారు. కటెవరంలో గ్రామ పంచాయతి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో వితంతు ఫింఛన్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి శనివారం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్లు యర్రంశెట్టి అనిల్ కుమార్, విశ్రాంత ఎంపిడిఒ షేక్ మొహిద్దిన్, కటెవరం పంచాయతి సెక్రటరీ గౌస్ మొహిద్దిన్, కార్యాలయ సిబ్బంది పాల్గున్నారు.


వృద్ధ, వితంతువుల నుంచి పింఛన్ దరఖాస్తును స్వీకరిస్తున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటి సభ్యులు

ఎస్‌ఎల్వీ అమరావతి ఫైడ్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బైపాస్ లోని తెనాలి ఫ్లైఓవర్ వద్ద ఎస్‌ఎల్వీ అమరావతి ఫ్రైడ్ క్లబ్ హౌస్ లో ఎయిమ్స్ డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌ఎల్వీ గ్రూప్స్ చైర్మన్ అండ్ సీఎండీ పీ శ్రీనివాసరాజు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మలేరియా, టైఫాయిడ్, హెచ్బి, ఆర్బిఎస్, హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎయిమ్స్ సీఎఫ్ఎం డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ రాజీవ్ రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ ఎస్‌ఎల్వీలో పని చేస్తున్న సుమారు 120 మంది వర్కర్స్ కు ఎయిమ్స్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎల్వీ గ్రూప్స్ డైరెక్టర్ రంగరాజు, ఎయిమ్స్ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనంత ప్రకాష్ పాల్గొన్నారు.



కంప్యూటర్ కోర్సులతో మెరుగైన ఉపాధి

ప్రజాశక్తి-తెనాలి

కంప్యూటర్ కోర్సులు చేయడం ద్వారా మెరుగైన ఉపాధి పొందవచ్చునని దళిత సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపకుల పతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. స్థానిక ప్రకాశం రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్ అకాడమి, జెవిఎస్‌క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట అతిథి గ్రాండ్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించిన కంప్యూటర్ కోర్సుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆచార్య కృపాచారి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ల వినియోగంతో సమయాన్ని వృథా చేసుకోకుండా, ఆ సమయాన్ని కంప్యూటర్ కోర్సులు చదివేందుకు కేటాయించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలనానరు. కెఎల్ యూనివర్సిటీ ప్రొపెషర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించారు. కార్యక్రమంలో జె.ఎబినేజన్, విశ్రాంత రెవిన్యూ ఉద్యోగి ఎన్.నాగేశ్వరావు, స్కాలర్ ఎ.గిరిధర్, యు.బాలరాజు, షేక్ అబ్దుల్ హకీంజాని, వి.రాధ, ఎం.నవీన, కె.మైనా, విద్యార్థులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులతో ఆచార్య కృపాచారి

రేపు ప్రజా సమస్యల పరిష్కారవేదిక

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కార మార్గం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణ పరిధిలోని ఈద్గాలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో పాల్గొంటారని పేర్కొన్నారు.



జగన్ శిలాఫలకం ధ్వంసంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-పెదనందిపాడు

విజయవాడ లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పేరుతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని మండల వైసిపి నాయకులు ఖండించారు. వైసిపి మండల కన్వీనర్ షేక్ కాసిం పీరా ఆధ్వర్యంలో శనివారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల వైసిపి నాయకులు కె. భూషయ్య, సి హెచ్ సాంబశివరావు, డి.రాంబాబు పాల్గొన్నారు.



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ సిఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా త్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారి తో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారి వాహనాలను సీజ్ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని, పలువురు అనుమానితులను ఆపి విచారించారు. ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.



200 రోజులుగా కొనసాగుతున్న అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-దుగ్గిరాల

ఎన్నికల అనంతరం కూడా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించడం ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు వల్లూరు నరసింహారావు అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాలలోని రైలుపేటలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రస్తుతం విద్యాశాఖ, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ సహకారంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ శనివారం నాటికి 200 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా స్వీట్, హాట్‌తో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్. చిరంజీవి, పఠాన్ జున్ను ఖాన్, సయ్యద్ కరీముల్లా పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు విద్యార్థుల విరాళం



దుగ్గిరాలలో విరాళాలిస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

కేరళ రాష్ట్రంలోని వాయనాడ్‌లో వరదలు వచ్చి ఊహకందని విధంగా ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లడం బాధాకరమని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య ఆవేదన వెలిబుచ్చారు. బాధితుల సహాయార్థం మండలంలోని రేవేంద్రపాడులో శనివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వాయనాడ్ ప్రాంతం ఇంకా పూర్తిగా కోలుకోలేదని, వరదతో పాటు కొండ చర్యలు విరిగిపడి ఆస్తి నష్టంతో పాటు ఎక్కువ సంఖ్యలో ప్రాణ నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఆ ప్రాంతం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హారిక జూనియర్ కాలేజీలో ప్రిన్సిపల్ నవీన్‌తో పాటు విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, నాయకులు జె.బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, శంకర్, జేమ్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మండలంలోని ఆత్మకూరులో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరించారు. నాయకులు యు.దుర్గారావు మాట్లాడుతూ ఏడాది వర్షపాతమంతా ఒకేరోజు కురవడం, మూడు నాలుగు గ్రామాలు కొండ ప్రాంతం నుంచి వచ్చిన వరదతో కూడిన బురద, రాళ్ల గ్రామం మీదగా ప్రవహించటంతో దాదాపు 400 మంది మృతి చెందారని, వందలాదిమంది జాడలేదని చెప్పారు. తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు మానవతా దక్పథంతో అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్.సీతారామాంజనేయులు, కె.సుజాత, బి.రాంబాబు, జి.అజయ్‌కుమార్, జి.లక్ష్మి, డి.పద్మనాభశర్మ, ఎం.సంధ్య, వి.రామారావు, వి.సుబ్రహ్మణ్యం, కె.లక్ష్మి, జి.కృష్ణారావు, వి.సురేష్, ఎం.శ్రీను పాల్గొన్నారు.

మంగళగిరి మండలం ఆత్మకూరులో విరాళాల సేకరిస్తున్న సిపిఎం శ్రేణులు



20 శాతం మందికే పంట నష్ట పరిహారం

- కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులివ్వాలి
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్



భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. పెదనందిపాడుకు శనివారం వచ్చిన ఆయన స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో 70 శాతానికి పైగా ఉన్న కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందడం లేదని చెప్పారు. కౌలురైతు పేరుతోనే ఈ-క్రాప్‌ను నమోదు చేయాలన్నారు. గతంలో మిచౌంగ్ తుపాను ధాటికి పంటలు నష్టపోయిన వారికి వారిలో 20 శాతం మందికే పరిహారం అందిందని, మిగతా 80 శాతం మందికీ సత్వరమే అందించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు ఛానల్ విస్తరణకు వెంటనే నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్కీము వర్కర్ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, నాయకులు జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు, కె.వెంకటశివరావు, సిహెచ్.యానాదులు, డి.శ్రీనివాసరావు, ఎన్.రాజేంద్ర, పి.భువనేశ్వరి, ఎం.లక్ష్మి, షేక్ షమీ పాల్గొన్నారు.

ఆఫ్రికన్ ఆర్థో సర్జన్స్‌కు మోకీలు మార్పిడిపై శిక్షణ

సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇకపై సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలపై శిక్షణ ఇవ్వనున్నట్లు సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. ఆఫ్రికన్ దేశాల్లో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజుల పర్యటన అనంతరం శనివారం డాక్టర్ నరేంద్రరెడ్డి విలేకరులతో మాట్లాడారు. అంగోల దేశ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పౌలలుటుకుట ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలిసారిగా రివిజన్ నీ (మోకీలు) రీప్లేస్మెంట్ సర్జరీ చేసినట్లు తెలిపారు. నాలుగు రోజులు పాటు అక్కడి సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు రివిజన్ ని రీప్లేస్మెంట్ పై శిక్షణ ఇచ్చామని అన్నారు. ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సూచన మేరకు యువ వైద్యులకు గుంటూరులోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లపై శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనున్నదని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి చెప్పారు.



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- వినుకొండ



పట్టణంలోని గుడ్ షఫర్డ్ పాఠశాల ఆవరణలో మూడ్రోజులపాటు జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి శనివారం ప్రారంభించారు. మొదటిరోజు పోటీల్లో 13 జిల్లాల నుండి 15 మహిళ జట్లు పాల్గొనగా వీరిలో విజయనగరం, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, కృష్ణ, విజయనగరం జట్లు గెలుపొందాయి. పురుషుల విభాగంలో 15 జట్లు పాల్గొనగా అనంతపురం, పశ్చిమ గోదావరి, అనంతపురం, తూర్పు గోదావరి, నెల్లూరు, కడప జిల్లా జట్లు గెలుపొందాయి. ఈ పోటీల్లో మొత్తం 30 జట్టులు పోటీ పడుతున్నాయని, విజేతలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి, మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీలకు పంపుతామని ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పీడీలు చిరంజీవి, సురేష్, రాధాకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల సెక్రెటరీ సత్యనారాయణ

మిట్టపల్లి ఇంజినీరింగ్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని తుమ్మలపాలెంలో ఉన్న శ్రీ మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే శనివారం నిర్వహించారు. కాలేజీ సెక్రటరి మిట్టపల్లి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి కిశోర్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మిట్టపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తమ కాలేజీలో ఈ ఏడాది సీట్లన్నీ ఇఎపి సెట్‌లోనే కౌన్సిల్ ద్వారా భర్తీ అయ్యాయన్నారు. తమ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. మిట్లపల్లి కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులంతా శ్రద్ధతో చదవాలని, కాలేజీలోని వసతులను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, లైబ్రేరీ అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.రంమాకాంత్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో మారుతున్న సమీకరణలు

వీక్షణం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని స్థానిక సంస్థల్లో గందరగోళం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఓడిపోయి కూటమి ఘన విజయం సాధించడంతో సమీకరణలు మారుతున్నాయి. స్థానిక సంస్థల్లో పూర్తిస్థాయిలో పట్టు ఉన్న వైసిపి పరిస్థితి అగమ్యగో చరంగా మారింది. మెజార్టీ ఉన్నా ఏమీ మాట్లాడలేని పరిస్థితి నెలకొంది. ఎన్నికలకు మూడు నెలల ముందు, ఆ తర్వాతా స్థానిక సంస్థల సమావేశాలు పూర్తిస్థాయిలో జరగడం లేదు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా వైసిపికి గుడ్‌బై చెప్పి ఎన్నికల ముందే టిడిపిలో చేరడంతో వైసిపి జెడ్‌పిటిసిల పరిస్థితి గందరగోళంలో పడింది. గత మే నెలలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించినా కోరం లేక వాయిదాపడింది. తిరిగి ఈనెల 3వ తేదీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగినా కేవలం స్టాండింగ్ కమిటీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీల ఎంపికకు ఆమోదానికి పరిమితమైంది. అజెండా ఏమీ రూపొందించలేదు. ప్రజా సమస్యలపై చర్చించలేదు. గత ఏడు నెలలుగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు పూర్తిస్థాయిలో జరగలేదు.

జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినాతోపాటు ఇప్పటివరకు 8 మంది జెడ్‌పిటిసిలు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఇంకా అనేక మంది టిడిపి వైపు వెళ్లేందుకు సిద్ధంగా ఉండటంతో వైసిపి నాయకులు ఈ విషయంలో ఏమీ పాలుపోక మౌనంగా ఉండిపోతున్నారు. ఇప్పటికే పలువురు ఎంపిపిలు కూడా పార్టీకి గుడ్‌బై చెప్పారు. దీంతో మండల పరిషత్‌లలో కూడా బలబలాలు మారిపోతున్నాయి. గుంటూరు కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ సజీలాతోపాటు దాదాపు 8 మంది కార్పొరేటర్లు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. గత ఐదు నెలలుగా కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరగలేదు. ఈనెల 17న జరపాలని మేయర్ కావటి మనోహర్ నాయుడు మళ్లీ అధికారులకు సూచించారు. గత నెల 20న జరపాలన్న మేయర్ ప్రతిపాదనను అధికారులు బుట్టదాఖలు చేశారు. ఇందుకు మేయర్ నిరసన తెలిపినా ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో కార్పొరేషన్‌లో ఈసారి సమావేశం జరిగితే వైసిపిబలం పూర్తిగా తగ్గిపోయి టిడిపి పైచేయి సాధించే అవకాశం ఉంది. తెనాలి, చిలకలూరిపేట మున్సిపాల్టీల్లోనూ కౌన్సిలర్లు పలువురు వైసిపి నుంచి టిడిపిలో చేరారు.

పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండంతో స్థానిక సంస్థల్లో వైసిపి కోటలకు బీటలు వారుతున్నాయి. పల్నాడు జిల్లాలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులుకు సన్నిహితంగా ఉన్న వైసిపి వారంతా ఇప్పటికే టిడిపి పంచన చేరారు. మరికొంత మంది పార్టీలో చురుగ్గా పనిచేయడం లేదు. ఎంపి శ్రీకృష్ణదేవరాయులతో మేమేకం అవుతున్నారు. వైసిపి నుంచి ఎమ్మెల్సీగా ఉన్న జంగా కృష్ణమూర్తి ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరడంతో ఆయనతో పలువురు జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు కూడా వైసిపికి గుడ్‌బై చెప్పారు. తాడికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, కత్తెర సురేష్ కూడా టిడిపిలో చేరడం వల్ల వారి అనుచరులుగా ఉన్న స్థానిక సంస్థల ప్రతినిధులు వైసిపికి గుడ్‌బై చెబుతున్నారు. ఇప్పటికే పలువురు జెడ్‌పిటిసిలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ టిడిపిలో చేరి గత ఎన్నికల్లో ప్రత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల్లో వైసిపి ఓటమికి కృషి చేశారు. ఆయన అనుచరులుగా ఉన్న స్థానిక సంస్థల ప్రతినిధులు ఇప్పటికే టిడిపిలో చేరారు.

గుంటూరు ఎంపిగా అభ్యర్థిగా వైసిపి నుంచి పోటీ చేసి ఘోరపరాజయం పాలైన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య కూడా ఇటీవల ఆపార్టీకి రాజీనామా చేశారు. ఆయన ఇంకా ఏ పార్టీలో చేరలేదు. జనసేనలో చేరేందుకు ఆయన వియ్యంకుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ ద్వారా ప్రయత్నిస్తున్నారు. దీంతో ఆయన అనుచరులు కూడా వైసిపికి గుడ్‌బై చెప్పనున్నారు. గుంటూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు సోదరుడు, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీ ఎన్నికలకు ముందే వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరారు. వారికి అనుకూలంగా ఉన్న కార్పొరేటర్లు, ఎంపిటిసిలు ఇటీవల టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గుంటూరు తూర్పులో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానీ, ఆయన కుమారుడు మాజీ డిప్యూటీ మేయర్ గౌస్ వైసిపి నుంచి టిడిపిలో చేరారు. తాజాగా గుంటూరు మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరి కూడా వైసిపికి రాజీనామా చేశారు. ఆయన బిజెపిలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

(ఎ.వి.డి.శర్మ)